ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
విజయనగరం
జిల్లా వార్తలు
మంగళవారం 18 నవంబరు 2025



సెంటుకు రూ.వెయ్యి.. ఎకరాకు రూ.లక్ష

● పీజీఆర్‌ఎస్‌లో రాకోడు రైతుల ఫిర్యాదు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామంలో రీ సర్వే జరుగుతోందని, ఈ సమయంలో తమ భూములను ఆన్‌లైన్ చేయాలని అధికారులను కోరితే సెంటుకు రూ.వెయ్యి... ఎకరాకు రూ.లక్ష ఇచ్చుకోవాలంటున్నారని విజయనగరం మండలం రాకోడు గ్రామానికి చెందిన రైతులు సోమవారం కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ రామసుందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తూ తమ సమస్యను విన్నవించారు. అంతకుముందు రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.



విజయనగరం: కంటోన్మెంట్‌లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపారాధన

హరోంహర


● కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో కిక్కిరిసిన శివాలయాలు

విజయనగరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో శివాలయాన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. పురాతన క్షేత్రాల నుంచి సాధారణ ఆలయాల వరకు భక్తులు పోటెత్తారు. శివునికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, విశిష్ట అర్చనలు నిర్వహించారు. ఉదయం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అన్ని శివాలయాల్లో ధ్వజస్తంభాల వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. విజయనగరంలో దేవదాయశాఖ పరిధిలో ఉన్న ఆలయాలన్నీ రోజంతా కిటకిటలాడుతూ కనిపించాయి. కాగా కార్తీక మాసం ఈ నెల 20న జరిగే పోలిపాడ్యమితో ముగియనుంది.



విజయనగరం: ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం

కట్టడి చేస్తారా?



రాజాం పట్టణంలో కుక్కల స్వైరవిహారం

● జిల్లాలో కుక్కల స్వైరవిహారం ● ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశం

● నెలలు గడుస్తున్నా కానరాని చర్యలు ● తాజాగా మునిసిపల్ శాఖ కీలక ఆదేశాలు

రాజాం/బొబ్బిలి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో కుక్కల స్వైరవిహారం ఆగడం లేదు. వీధి కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రోజుకు సగటున 30 మంది వరకూ కుక్కకాటుకు గురవుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. అయితే వీటి నియంత్రణకు కఠిన చర్యలు చేపడుతున్న దాఖలాలు లేవు. ప్రధాన రహదారులు, కూడళ్లలో కుక్కలు కనిపించకుండా సంరక్షణా కేంద్రాలకు తరలించాలని ఆ మధ్య సుప్రీంకోర్టు ఆదేశించింది. రేబిస్ మరణాల పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. వీధి కుక్కలను షెల్టర్ల కు తరలించాలని నిర్దేశించింది. ఇది జరిగి నెలలు కావొస్తున్నా అటువంటి చర్యలేవీ విజయనగరం కార్పొరేషన్‌తో పాటు మునిసిపాల్టీల్లో కనిపించ డంలేదు. తాజా మునిసిపల్ శాఖ కార్యదర్శి ఆదేశాలతోనైనా కదులుతారా? లేరా? అన్నది చూడాలి.

ఏటా పెరుగుతున్న బాధితులు

గత ఏడాది జిల్లాలో 12,767 మందిని కుక్కలు కాటేశాయి. నలుగురు (మిగతా 8వ పేజీలో..)

● పట్టణాల్లో కుక్కల నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టిపెట్టండి. స్టెరిలైజేషన్, యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను ఇవ్వండి. రేబిస్ సోకిన కుక్కలను గుర్తించి వెంటనే ప్రత్యేక షెల్టర్లకు తరలించండి. ముఖ్యంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, క్రీడా మైదానాల వద్ద కుక్కలు సంచరించ కుండా చర్యలు తీసుకోవాలి. వాటికి బహిరంగ ప్రదేశాల్లో ఆహారం పెట్టకుండా ప్రత్యేక శిబిరాల వద్దకు తీసుకెళ్లి ఆహారం అందించాలి.

- ఈ నెల 16న పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఇచ్చిన ఆదేశాలివి.

● రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి రోజుకు 15 నుంచి 20 మంది కుక్కకాటు బాధితులు వస్తున్నారు. నియోజకవర్గంలోని 4 మండలాల్లో పీహెచ్‌సీలకు ప్రతినెలా 30 మంది వరకూ కుక్కకాటు బాధితులు నమోదవుతున్నారు. గడిచిన ఆరు నెలల వ్యవధిలో రాజాం నియోజకవర్గంలో 4,711 కుక్కకాటు బాధితులను ఆస్పత్రులను ఆశ్రయించారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

కుక్కల నియంత్రణకు చర్యలు

కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఉత్తర్వులు వచ్చిన మాట వాస్తవమే. కుక్కలను తరలించి యాంటీ రేబిస్ ఇంజక్షన్లు, సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తాం. అలాగే వీధి కుక్కల సంరక్షణకు సంబంధించి ప్రత్యేక కేంద్రాలను సైతం ఏర్పాటుచేస్తాం.

- కె.రామచంద్రరావు, కమిషనర్, రాజాం

తిరిగి ఇచ్చేయాలి



● జిందాల్ బినామీల నుంచి సొమ్ము రికవరీ దిశగా రెవెన్యూ అడుగులు

● అప్పట్లో భూములు ఇవ్వనప్పటికీ అక్రమంగా నష్టపరిహారం పొందిన 12మంది

● ఫిర్యాదు చేసిన లోక్‌సత్తా పార్టీ

● రూ.36.10లక్షలు చెల్లింపులు జరిగినట్లు తేల్చిన ఏసీబీ

● ఆర్‌ఆర్ చట్టప్రకారం చర్యలకు దిగిన తహసీల్దార్

● తాజాగా నోటీసులు జారీ

జిందాల్ పరిశ్రమ భూ సేకరణలో భూములు కోల్పోకుండా నష్టపరిహారం పొందిన వారి నుంచి రికవరీ చేసేందుకు తొలి అడుగుపడింది. వారందరికీ శనివారం నుంచి నోటీస్‌లు జారీ చేసేందుకు రెవెన్యూ అధికారులు ఉపక్రమించారు. గ్రామ రెవెన్యూ సిబ్బంది చిరునామాలను వెతుకుతున్నారు. 17 ఏళ్ల కిందట జరిగిన ఈ వ్యవహారాన్ని కొలిక్కితెచ్చే పనిలో నిమగ్నమయ్యారు.

శృంగవరపుకోట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిందాల్ భూ సేకరణలో భూములు ఇవ్వకుండానే ఇద్దరు రూ. 5లక్షల చొప్పున, ఒకరు రూ.4.80లక్షలు, ముగ్గురు రూ.3లక్షలు, ఒకరు రూ.2.40 లక్షలు, ముగ్గురు రూ.2లక్షలు, ఒకరు రూ.1.98 లక్షలు, మరొకరు రూ.1.92 లక్షలు ఇలా మొత్తం 12 మంది బినామీలు రూ.36.10లక్షల నష్టపరిహారాన్ని అక్రమంగా పొందారు. అప్పట్లో జరిగిన తప్పును సరిదిద్దేపనిలో రెవెన్యూ శాఖ పడింది. వీరందరికీ శనివారం నుంచి నోటీస్‌లు జారీ చేసేందుకు ప్రయత్నిస్తోంది.

శృంగవరపుకోట మండలం కిల్తంపాలెం, చీడిపాలెం, ముషిడిపల్లి (మిగతా 8వ పేజీలో..)

స్టీల్‌ప్లాంట్‌కు భూములివ్వం

● నిరసన వ్యక్తం చేసిన గుర్ల మండల రైతులు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్‌కు భూములు ఇచ్చేది లేదంటూ గుర్ల మండలం బెల్లానపేట, దమరసింగి, కెల్ల, వల్లాపురం, మన్యపూరిపేట గ్రామాలకు చెందిన వారు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఈ భూముల్లో వివిధ పంటలు సాగు చేసుకుంటూ వందలాది మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారని, కొండ చుట్టూ పశువులు, గొర్రెలు, మేకలను పెంచుతూ మరికొంతమంది జీవనం సాగిస్తున్నారని, వారి ఉపాధిని దెబ్బతీయవద్దని కోరారు. వెంటనే ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు బి.రాంబాబు, శ్రీనువాసు, రమణ, మీసాల వర ప్రసాద్, దమర సింగి దంతులలూరి రమేష్ , కృష్ణం రాజు, గొర్లి శంకరరావు ,అసిరి నాయుడు తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఈ మార్పు ఎటువైపో!



● ఇదివరకు జిందాల్ అల్యూమినియం లిమిటెడ్ పేరు

● ఇప్పుడు ఇండస్ట్రియల్ పార్కుగా మార్పు

● ఎంఎస్‌ఎంఈల శంకుస్థాపనకు ఏర్పాట్లు

● సీఎం రాకకోసం సిద్ధమవుతున్న హెలిప్యాడ్

● నిర్వాసితుల ఆందోళనలతో భూమి పూజ వాయిదా పడుతున్నట్లు ప్రచారం



ఇండస్ట్రియల్ పార్కు కార్యాలయ ఆవరణలో సిద్ధమవుతున్న హెలిప్యాడ్

శృంగవరపుకోట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట మండల పరిధిలోని బొడ్డవర వయా తాటిపూడి రోడ్డులో ఉన్న జెఎస్‌డబ్ల్యూ అల్యూమినియం లిమిటెడ్ కార్యాలయం బోర్డుపై జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్కుగా పేరు మారింది. శనివారం కంటైనర్ కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. ఇక్కడ ఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు సీఎం నారాచంద్రబాబు నాయుడు డిసెంబరులో వస్తారని ప్రచారం జరిగింది. ఇందుకోసం ప్రత్యేకంగా హెలిప్యాడ్‌ను సిద్ధం చేస్తున్నారు. అయితే భూనిర్వాసితుల ఆందోళనలు కొనసాగుతుండడంతో ఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణానికి భూమి పూజ వాయిదా పడుతుందని చెప్పుకుంటున్నారు.

శృంగవరపుకోట మండలం చీడిపాలెం, చినఖండేపల్లి, కిల్తంపాలెం, మూలబొడ్డవర, ముషిడిపల్లి గ్రామాల పరిధిలో జేఎస్‌డబ్ల్యూ (జిందాల్ సౌత్ వెస్ట్) అల్యూమినియం లిమిటెడ్ నిర్మాణానికి 2007 జూన్‌లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం 834.66 ఎకరాల అసైన్డ్ భూమి, 151.04 ప్రభుత్వ భూమిని కేటాయించిన సంగతి తెలసిందే. దీంతో పాటు ఈ పరిశ్రమ యాజమాన్యం మరో 180.73 ఎకరాలను (జిరాయితీ భూములను)రైతుల నుంచి కొనుగోలు చేసింది. మొత్తం 1166.43 ఎకరాలలో అల్యూమినియం శుద్ధి కర్మాగారం (రిఫైనరీ విద్యుత్ పవర్ ప్లాంట్) నిర్మిస్తామని యాజమాన్యం చెప్పింది. దాదాపు పద్దెనిమిది సంవత్సరాలు పూర్తవుతోంది. ఎటువంటి పరిశ్రమ నిర్మాణం జరగలేదు. కాగా 2023 నవంబరులో (మిగతా 8వ పేజీలో..)

వేటకు వెళ్లి..

● తునివాడ వద్ద నాగావళిలో మత్స్యకారుడి గల్లంతు

● రెండురోజుల తర్వాత బయటపడిన మృతదేహం



ముంతా లక్ష్మణరావు(ఫైల్)

రేగిడి, నవంబరు 17,(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు నాగావళి నదికి వెళ్లిన మత్స్యకారుడు అనుకోని పరిస్థితిలో గల్లంతై రెండురోజుల తర్వాత మృతదేహంగా కంటపడ్డాడు. ఎస్‌ఐ బాలకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆ వివరాలిలా ఉన్నాయి.

తునివాడ గ్రామానికి చెందిన మత్స్యకారుడు ముంతా లక్ష్మణరావు(55) శనివారం చేపలవేట కోసం ఎప్పటిలాగే తోటి మత్స్యకారుడు పాపయ్యతో స్థానిక నాగావళి తీరంలో వేటకు వెళ్లాడు. పాపయ్య (మిగతా 8వ పేజీలో..)

రైతుల సమక్షంలోనే రీసర్వే 6

● సర్వే శాఖ డీడీ శ్రీనివాసులరెడ్డి

100 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు

● గ్రిడ్‌కు అనుసంధానం చేశాం ● సీఎండీ పృథ్వీతేజ్



విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) పరిధిలో 100 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటుచేసినట్టు సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం కింద ఇప్పటివరకూ 31,022 రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను పెట్టామన్నారు. వాటి ద్వారా 1,00,026 కిలోవాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతోందన్నారు. ఏలూరు జిల్లాలో అత్యధికంగా 13,491 కిలోవాట్లు, కాకినాడ జిల్లాలో 3,960, విశాఖపట్నం జిల్లాలో 3,715, తూర్పు గోదావరి జిల్లాలో 3,532, పశ్చిమ గోదావరి జిల్లాలో 3,382, శ్రీకాకుళంలో 3,366, విజయనగరంలో 3,279, అనకాపల్లి జిల్లాలో 2,841, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1,934, పార్వతీపురం మన్యంలో 864, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 15 సోలార్ రూఫ్‌టాప్‌లు అమర్చామన్నారు. వీటన్నింటినీ గ్రిడ్‌కు అనుసంధానం చేశామన్నారు. అపార్టుమెంట్లలో వ్యక్తిగత సోలార్ ప్లాంట్లకు అవకాశం లేనందున, కామన్ సర్వీస్‌కు ఉన్న కాంట్రాక్ట్ లోడ్‌కు అనుగుణంగా సోలార్ రూఫ్ టాప్ పెట్టుకోవచ్చునన్నారు. 500 కిలోవాట్ల వరకు కిలోవాట్‌కు రూ.18 వేలు చొప్పున రాయితీ లభిస్తుందన్నారు. అతి తక్కువ వడ్డీకి బ్యాంకు రుణాలు, ఈఎంఐలు ఇస్తాయన్నారు. వినియోగదారులు పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొని, అందులో ఎంప్యానల్ అయిన వెండర్స్ నుంచి సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తుకు, నెట్ మీటర్‌కు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. స్మార్ట్ మీటరు పెట్టుకున్న వారికి నెట్ మీటర్ అవసరం లేదని స్పష్టంచేశారు.

రూ.436కే రూ.లక్షల బీమా

● రూ.20 కే రూ.2లక్షల ప్రమాద బీమా

● ఉపయోగకరంగా కేంద్ర ప్రభుత్వ తాజా బీమా పథకాలు

బొబ్బిలి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం వివిధ వర్గాల ప్రజలకు ప్రయోజనకరంగా పలు బీమా పథకాలు తీసుకొచ్చింది.వాటిపై ప్రజల్లో అవగాహన కోసం బ్యాంకులు, ఎన్‌జీవోలకు సూచనలు ఇచ్చింది. వార్షిక ప్రీమియం రూ.20కే రెండు లక్షల రూపాయల ప్రమాద బీమాను వర్తింపజేసే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం అమలు చేస్తోంది. 18 నుంచి 70 (మిగతా 8వ పేజీలో..)

కట్టలకు ఆశపడి కటకటాల్లోకి..

● రాయగడ ఎక్స్‌ప్రెస్‌లో రూ.87 లక్షల చోరీ నిందితుల అరెస్టు 6

అర్జీలు త్వరగా పరిష్కరించాలి: కలెక్టర్ 6


పాచిపెంట: పారమ్మకొండ వద్ద నిర్వహించిన శివ పార్వతుల కల్యాణోత్సవంలో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించారు


పూసపాటిరేగ: దీపారాధనలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి


పూసపాటిరేగ: కొవ్వాడ అగ్రహారంలో నిర్వహించిన లక్ష దీపారాధనలో పాల్గొన్న భక్తులు

హరోం హర

- శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

కార్తీక మాసంలో చివరి నాలుగో సోమవారం జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే ఆలయాల వద్ద అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరారు. హరహర మహదేవ శంభో శంకర అంటూ ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. విజయనగరం, ఎస్‌.కోట, బొబ్బిలి, పార్వతీపురం, పాలకొండ తదితర పట్టణాలతోపాటు గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వివిధ ఆలయాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం


బొబ్బిలి రూరల్: పెంట గ్రామం శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


ఎస్‌.కోట: పుణ్యగిరి ఉమాకోటి లింగేశ్వర స్వామికి పూజలు


ఎస్‌.కోట రూరల్: ధర్మవరం సన్యాసేశ్వర స్వామి ఆలయంలో..


గరుగుబిల్లి: గిజబలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో..


బొబ్బిలి: జంగాల శివాలయంలో..


కొమరాడ: గుంప సోమేశ్వరాలయంలో..


కొత్తవలస: రామలింగపురం గ్రామంలో ఉమా రామలింగేశ్వర స్వామికి పూజలు చేస్తున్న న్యాయాధికారి విజయ్‌చందర్


రేగిడి: కొర్లవలసలో ఎండల మల్లికార్జునస్వామి ఆలయం ప్రాంగణంలో కోటి దీపోత్సవం


శృంగవరపుకోట: పుణ్యగిరి ఆయలంలో ధ్వజ స్తంభం వద్ద..


శృంగవరపుకోట: పుణ్యగిరి కొండెక్కుతున్న భక్తులు


రేగిడి: శివలింగానికి పూజలు చేస్తున్న సాధువులు


పార్వతీపురం టౌన్: కాశీవిశ్వేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


బొబ్బిలి: స్వామి దర్శనానికి క్యూలో భక్తులు

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

- విజయనగరం కలెక్టర్ రామసుందర్ రెడ్డి
- పీజీఆర్ఎస్‌లో వివిధ సమస్యలపై 230 వినతులు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో(పీజీఆర్ఎస్) వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో కలెక్టరు రామసుందర్ రెడ్డి, డీఆర్వో శ్రీనివాస్ మూర్తి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు వివిధ సమస్యలపై 230 వినతులు స్వీకరించారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 92 వినతులు రావడం విశేషం. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని కోరారు. పీజీఆర్ఎస్ టోల్‌ఫ్రీ నెంబరు 1100పై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఈ నెంబరుకు అందిన కాల్స్‌ను కూడా సంబంధించిన అధికారి సమాధానం సరైన రీతిలో తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా గృహాలకు కోసం దరఖాస్తు చేసుకున్నవారి వివరాలను సర్వే చేసి అర్హత ఉన్నవారి వివరాలను యాప్‌లో ఎంపీడీవో నమోదు చేయాలని కలెక్టరు ఆదేశించారు.


సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

ప్రతి దరఖాస్తుకు ప్రాధాన్యమివ్వండి

- పార్వతీపురం మన్యం కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌కు అందిన ప్రతి దరఖాస్తుకు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్, జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్‌.వైశాలి, పాలకొండ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా పార్వతీపురం పట్టణానికి చెందిన చింతాడ అనంతరావు సామాజిక పింఛన్ మంజూరు చేయాలని కోరారు. కురుపాం మండలం ఆవిరి గ్రామానికి చెందిన ఎ.రాజారావు తాను ఇంటర్మీడియట్ పూర్తి చేశానని, స్వయం ఉపాధి కల్పించాలని వినతిపత్రం అందజేశారు. జియ్యమ్మవలస చినమేరంగి గ్రామానికి చెందిన ఎస్‌.చక్రవర్తి సదరం సర్టిఫికెట్ మంజూరు చేయాలని కోరారు. గరుగుబిల్లి మండలంలో చిన్నగొడబ, పెద్దగొడబ గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాల పై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల వారు కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డికి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివ్యాంగుల వద్దకు వెళ్లి వినతులను స్వీకరించారు. పలువురికి వినికిడి యంత్రా లను అందజేశారు.


దివ్యాంగుల వద్దకు వెళ్లి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

ఫిర్యాదుదారులకు న్యాయం చేయండి: ఎస్పీ

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 29 ఫిర్యాదులు

విజయనగరం క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారుల పట్ల సానుకూలంగా స్పందించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ కోరారు. ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. సోమవారం విజయనగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ దామోదర్ నిర్వహించిన, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 29 ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులోభూ తగాదాలకు సంబంధించి 11 ఫిర్యాదు అందాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని సంబంధిత పోలీసు అధికారులతో సమస్యలను వివరించి, చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని వాటి పూర్వాపరాలను విచారణచేసి అంశాల్లో వాస్తవాలు గుర్తించి చట్టపరిధిలో చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే పరిష్కరించాలని, ఏడు రోజుల్లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుని, తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, ఎస్బీ సీఐ లీలారావు, ఎస్ఐలు రాజేష్,ప్రభావతి సిబ్బంది పాల్గొన్నారు.



వృద్ధుడితో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఉద్యోగులకు ఆరోగ్యం ముఖ్యం

- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజలకు సేవలందించే అధికారులు, ఉద్యోగులకు ఆరోగ్యం కూడా ముఖ్యమని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అందుకోసమే ఈ ఉచిత వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లా ఆసుపత్రిలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు సేవలు అందించే అధికారులు పనుల ఒత్తిడిలో తమ ఆరోగ్యం గుర్తించి పట్టించుకోరన్నారు. తద్వారా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వైద్య శిబిరంలో 91 మంది జిల్లా అధికారులు వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈసీజీ 49 మంది, ల్యాబ్ పరీక్షలు 69 మంది, హైపర్ టెన్షన్ 23 మంది, డయాబెటిస్ 23 మంది ఉన్నట్టు గుర్తించారు. రిఫరల్‌కు కార్డియాలజీ 13 మంది, గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఒకటి, క్యాన్సర్ స్క్రీనింగ్ రెండు, న్యూరాలజీ ఒక కేసు నమోదైంది. నవంబరు 20న జిల్లా ఆసుపత్రి క్యాంపస్‌లో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులు వైద్య శిబిరం నిర్వహించనున్నారు.


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి


సర్వేను పరిశీలిస్తున్న సర్వే డీడీ శ్రీనివాసులరెడ్డి

రైతుల సమక్షంలోనే రీసర్వే

- సర్వే శాఖ డీడీ శ్రీనివాసులరెడ్డి

భోగాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహించనున్నట్లు సర్వే శాఖ డీడీ టి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని కవులవాడ సమీపంలో జరుగుతున్న రీసర్వేను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే జరుగుతున్న సమయంలో రైతులు దగ్గరుండి పూర్తి చేసుకోవాలన్నారు. అందరి సమక్షంలో జాయింట్ ఎల్‌పీఎంలు, అన్నదమ్ముల భూములు, తదితరవాటిని దగ్గరుండి తదుపరి ఎటువంటి భూమస్యలకు ఆశ్కారం లేకుండా చేయించుకోవాలని సూచించారు. రీసర్వేకు ముందు రైతులకు సమాచారం ఇవ్వాలని, తదుపరి భూసమస్యలు రాకుండా ఉండే విధంగా చేయాలని సర్వే సిబ్బందికి సూచించారు. రికార్డులు, సర్వే పరికరాలు రోవర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఐవోఎస్ విగ్నేశ్వరరావు, మండల సర్వేయర్ శివాజీ, ఆర్ఎస్ డీటీ రవి, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


తరగతి గదిలో విద్యార్థులు

విధులు బహిష్కరించిన గెస్ట్ ఉపాధ్యాయులు

భామిని, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో విధులు నిర్వహిస్తున్న 18మంది గెస్ట్ ఉపాధ్యాయులు సోమవారం విధులను బహిష్కరించారు. దీంతో విద్యార్థులను ప్రిన్సిపాల్, సీఆర్‌టీల పర్యవేక్షించారు. ఈ విషయం గురుకులం ప్రిన్సిపాల్ విజయనిర్మల వద్ద ప్రస్తావించగా నిన్నటి వరకు విధుల్లోనే ఉన్నారని, ఉదయం నుంచి అందరు ఉపాధ్యాయులు గైర్హాజరయ్యారు. దీనిపై ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు.

కట్టలకు ఆశపడి కటకటాల్లోకి..

- రాయగడ ఎక్స్‌ప్రెస్‌లో రూ.87 లక్షల చోరీ నిందితుల అరెస్టు

విజయవాడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్‌లో రూ.87 లక్షలు ఉన్న బ్యాగ్‌ను కాజేసిన నిందితులను జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను జీఆర్పీ డీఎస్పీ రత్నరాజు నగరంలోని రైల్వే ఎస్పీ కార్యాలయంలో వెల్లడించారు. ప్రకాశం జిల్లాకు చెందిన బూదల లలిత్‌బాబు.. విజయనగరం జిల్లా తెర్లాం గ్రామంలో ఉన్న ఓ పౌల్ట్రీలో హెచ్‌ఆర్ గుమస్తాగా పనిచేస్తున్నాడు. పౌల్ట్రీ ప్రధాన కార్యాలయం గుంటూరులో ఉంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పౌల్ట్రీల్లోని నగదును ఎప్పటికప్పుడు ప్రధాన కార్యాలయానికి తరలిస్తారు. ఈ నగదును తీసుకెళ్లడానికి ప్రధాన కార్యాలయం నుంచి ఒక మేనేజర్‌ను ఆయా పౌల్ట్రీలకు పంపుతారు.

రెండుసార్లు విఫలయత్నం

తెర్లాం పౌల్ట్రీలో ఉన్న రూ.87 లక్షలను తీసుకెళ్లడానికి గుంటూరులోని ప్రధాన కార్యాలయ మేనేజర్ నాగరాజు కొద్దిరోజుల క్రితం అక్కడికి వెళ్లాడు. దీన్ని గమనించిన హెఆర్ గుమస్తా లలిత్‌బాబుకు దురాశ కలిగింది. డబ్బును పౌల్ట్రీలో కాజేస్తే దొరికిపోతానని భావించిన అతడు దాన్ని తరలించే మార్గంలో చోరీ చేస్తే దొంగలపైకి ఆ నేరం వెళ్తుందనుకున్నాడు. ఈ ప్రణాళికలో తన సోదరుడు అశోక్‌కుమార్‌ను భాగస్వామిని చేశాడు. నాగరాజు నగదును ఎక్కువగా బస్సులో తీసుకెళ్తుంటాడు. దీన్ని గమనించిన లలిత్‌బాబు రెండుసార్లు బ్యాగ్‌ను మాయం చేయడానికి ప్రయత్నించినా కుదరలేదు. గతనెల 31వ తేదీన నాగరాజు రూ.87 లక్షల బ్యాగ్‌తో గుంటూరుకు బయల్దేరుతున్న విషయం తెలుసుకున్న లలిత్‌బాబు తన సోదరుడు అశోక్‌కుమార్‌కు సమాచారం ఇచ్చాడు. ఆ రోజు బస్సు ప్రయాణం వీలు కాకపోవడంతో నాగరాజు విశాఖపట్నం వచ్చి రాయగడ-గుంటూరు రైలులో బీ1 భోగీలో ఎక్కాడు.

వీవోఐపీల ద్వారా సమాచారం

సెల్‌ఫోన్లలో మాట్లాడుకున్నా, వాట్సాప్ కాల్స్ చేసినా పోలీసులు పసిగట్టేస్తారను కున్న లలిత్‌బాబు వీవోఐపీ (వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రొటోకాల్) ద్వారా కాల్స్ మాట్లా డుకునేవాడు. నాగరాజు బీ1 భోగీలో ఎక్కుతున్నాడని సమాచారం ఇచ్చాడు. అశోక్‌కుమార్ మఫ్టీలో ఉండే పోలీసు మాదిరిగా తయారయ్యాడు. తలపై టోపీ పెట్టుకుని, మాస్క్ ధరించి పోలీసు మాదిరిగా వైజాగ్ రైల్వేస్టేషన్‌లో భోగీలోకి ఎక్కాడు. అక్కడి నుంచి విజయవాడ వరకు ప్రయాణించాడు. నాగరాజు లోయర్ బెర్త్‌పై గాఢనిద్రలో ఉన్నాడు. 1వ తేదీ తెల్లవారు జామున 3 గంటల సమయంలో దీన్ని గమనించి బెర్త్ కింద ఉన్న నగదు బ్యాగ్‌ను కాజేశాడు. రైలు విజయవాడ స్టేషన్‌కు రాగానే ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంపై దిగి ప్రయాణికుడిలా బయటకు వచ్చాడు. అక్కడి నుంచి ఆటోలో వారధి దాటి తాడేపల్లి వరకు వెళ్లాడు. అక్కడ బస్సు ఎక్కి మంగళగిరి చేరుకున్నాడు. ప్రకాశం జిల్లాకు బస్సులో వెళ్లాడు. తర్వాత తెర్లాం నుంచి లలిత్‌బాబు ప్రకాశం జిల్లాకు వెళ్లాడు. ఇద్దరూ కలిసి రూ.87 లక్షల్లో రూ.2.50 లక్షలను ఖర్చు చేశారు. మిగిలిన డబ్బుతో చెన్నైలో ఆస్తులు కొనడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. నాగరాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన జీఆర్పీ పోలీసులు సాంకేతికంగా దర్యాప్తు చేపట్టారు. వైజాగ్, విజయవాడ రైల్వేస్టేషన్లలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. ముందుగా పోలీసులు అశోక్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత లలిత్‌బాబు పేరు బయటకొచ్చింది. వారి నుంచి రూ.84.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ జేవీ రమణ, ఆర్పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ పొన్నుస్వామి, ఇన్‌స్పెక్టర్ ఫతే అలీబేగ్‌తో పాటు సిబ్బందిని అధికారులు అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ డీఎస్పీ రత్నరాజు

ఎరువులు ఇస్తాం.. విత్తనాలు అందజేస్తాం

● పూసపాటిరేగ మండలంలోని రైతులకు మొక్కజొన్న కంపెనీల ఎర ●లాభాలొస్తాయని ఆశచూపుతున్న వైనం

పూసపాటిరేగ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు మొక్కజొన్న కంపెనీలు ఎరువులు ఇస్తాం.. విత్తనాలు అందజేస్తామని ఎరచూపుతున్నాయి. సాగుచేస్తే అధిక లాభాలు వస్తాయని ఆశచూపుతున్నాయి.ఈ నేపథ్యంలో కంపెనీలు నేరుగా రంగంలోకి దిగకుండా కొందరు దళారులు రంగ ప్రవేశంచేశారు.అయితే నేరుగా కంపెనీలతో ఒప్పందాలు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

మండలంలో ఐదు వేల హెక్టార్ల సాగు భూమి ఉండగా ఇందులో గత ఏడాది 2,500 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశారు. ఇక్కడ సాగుకు ఆశాజనకంగా ఉండడం, గతంలో గిట్టుబాటు కావడం తదితర కారణాల వల్ల ఎక్కువ మొత్తంగా మొక్కజొన్న సాగుకు మొగ్గుచూపారు. ఈనేపథ్యంలోకొన్ని మొక్కజొన్న కంపెనీలు పూసపాటిరేగ మండలంలో రైతులకు విత్తనాలు ఇస్తామని ఆశచూపడంతోపాటు తాము అందజేసిన మొక్కజొన విత్తనాలు వేస్తే లాభాల పంట పండుతుందని మభ్యపెట్టాయి. తాజాగా ఈ ఏడాది కూడా రైతులను కంపెనీల ప్రతినిధులు దళారుల ద్వారా ఆశ్రయిస్తున్నాయి. గతఏడాది రైతులతో మండలంలో సుమారు రెండువేల ఎకరాల్లో పలు కంపెనీలు సాగు చేయించాయి. ఇక్కడి రైతులను ఒప్పించేందుకు ఆయా పరిశ్రమల నిర్వాహకులు నేరుగా కాకుండా కొందరు దళారులను రంగంలోదింపాయి. దళారుల మాటల నమ్మి గతఏడాది మోసపోయామని రైతులు వాపోతున్నారు.చివరికి కనీస ఖర్చులు కూడా రాని పరిస్థితినెలకొందని పలువురు చెబుతున్నారు. తిరిగి ఈ ఏడాది కూడా మొక్కజొన్న వేయాలని కొండగుడ్డు వద్ద ఇటీవల కొందరు సమావేశం ఏర్పాటుచేయడంతో బాధిత రైతులు తెలుసుకొని అక్కడ నిలదీశారు.ఇదే సమయంలో పత్రికల్లోకథనాలు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు విచారణ చేపట్టడంతో రూ.రెండు కోట్లకుపైగా రైతులకు పంపిణీ చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామాల్లో రైతులకు సూచనలు చేస్తున్నారు. మొక్కజొన్న పరిశ్రమల నిర్వాహకులకు నేరుగా అగ్రిమెంట్ ఇవ్వాలని, అలా అయితేనే వీరికి సహకరించాలని వ్యవసాయశాఖ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. దళారుల మాటలు విని మోసపోవద్దని అధికారులు సూచిస్తున్నారు. కాగా పలు పరిశ్రమల యాజమాన్యాలుఅక్రమంగా పురుగుమందులు, విత్తనాలు నిల్వచేశాయి. వీటినిరైతులకు అందజేస్తున్నారని కొద్దిరోజుల కిందట సమాచారం రావడంతో వ్యవసాయశాఖ సిబ్బంది సీజ్‌చేసిన విషయం విదితమే. కాగా రహస్యప్రాంతాల్లో నిల్వచేసిన విత్తనాలు, పురుగులు మందులు రైతులకు పంపిణీకి పలు కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని తెలుస్తోంది.



అక్రమంగా నిల్వచేసిన విత్తనాలు, పురుగుమందులను సీజ్‌చేస్తున్న అధికారులు(ఫైల్)

దళారీలను నమ్మి మోసపోకండి

దళారీలు చెప్పినమాటలు విని మోసపోవద్దని ఏవో నీలిమ తెలిపారు. ఈ విషయంపై ఇప్పటికే రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఆయా కంపెనీలు నేరుగా రైతులతో అగ్రిమెంట్ చేసుకొంటేనే దీనికి రైతులు సహకరించాలని తెలిపారు. అక్రమంగా విత్తనాలు, పురుగుమందులు నిల్వచేసినా, రైతులకు అక్రమంగా అందజేసిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

నేడు గ్రంథాలయంలో సదస్సు

విజయనగరం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయాల ప్రాధాన్యతపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు నవ్యంధ్రా జిల్లా ప్రజా గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు పిషణ్ముఖరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమానికి గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ రొంగలి పోతన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లక్ష్మి, సంఘ ప్రతినిధులు బాలకృష్ణ, ఈపు విజయ్ కుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు.

ఫార్మాసిస్టులకు ఉపాధి అవకాశాలు

నెల్లిమర్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రానున్న కాలంలో ఫార్మాసిస్టులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు పెరగనున్నాయని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి తెలిపారు. సోమవారం సెంచూరియన్ వర్సిటీలో జాతీయ ఫార్మసీ వారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్టర్ పీఎస్వీ రమణా రావు, డీన్‌శ్రావణి, ఫార్మసీ అధ్యాపకులు డేవిడ్, శ్రీను,గౌరీశంకరరావు పాల్గొన్నారు.

గౌరీదేవి అనుపోత్సవం

లక్కవరపుకోట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):మండలంలోని రంగారాయపురంలో గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం సోమవారంరాత్రి జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే లలితకుమారి దంపతులు గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామలక్ష్మి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమాజానికి సేవలందించాలి

చీపురుపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసి సమాజానికి పరోక్షంగా సేవలంచాలని ఎంపీడీవో ఐ.సురేష్ కోరారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా వలంటీర్ల శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం ఎన్. అప్పలనాయుడు,డిజిటల్ అక్షరాస్యత కోఆర్డినేటర్, సీసీలు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం అధ్యక్షుడికి అభినందన

భోగాపురం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండలం పోలిపల్లిలో ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజుని పూసపాటిరేగ మండలంలోని కోనాడ సాగర మత్స్యపారిశ్రామిక సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన అధ్యక్షులు, సభ్యులు కలిశారు. ఈసందర్భంగా వారిని బంగార్రాజుసన్మానించి అభినందించారు.

ఐసీఏఐ ఫలితాల్లో సత్తాచాటిన రమ్య

విజయనగరం కలెక్టరేట్ నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయనగరానికి చెందిన అన్నే వెంకట రమ్య ఆదివారంరాత్రి విడుదలైన ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఆడిట్ అసెస్‌మెంట్ (ఐసీఏఐ) టెస్టు ఫలితాల్లో సత్తాచాటింది.ఆమె గత కొన్నేళ్ళుగా ఆడిటర్‌గా పనిచేస్తూ గుర్తింపు తీసుకొచ్చింది. రమ్య ఆల్ ఇండియా ర్యాంకు సాధించడంతో జిల్లాకు చెందిన ఆడిటర్లు అభినందించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

నెల్లిమర్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజిని తెలిపారు.నెల్లిమర్ల నగర పంచాయతీ జరజాపుపేటలోని జగనన్న కాలనీకి మంజూరైన తాగునీటి బోరు ఏర్పాటుకుసోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, గృహ నిర్మాణశాఖ ఏఈ పవన్ కుమార్, కౌన్సిలర్ అవనాపు సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ ఎం.ఎం.నాయుడు, కాళ్ల సత్యవతి, కమిషనర్ టి.జైరామ్, గృహ నిర్మాణ ఏఈ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

సకాలంలో హాజరైతేనే కూలి గిట్టుబాటు: ఎంపీడీవో

రాజాం నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) ప్రతి రోజు ఉపాధి పనులకు సకాలంలో హాజరైతేనే కూలి గిట్టుబాటు అవుతుందని ఎంపీడీవో జె.ఆనందరావు తెలిపారు. సోమవారం గారాజుచీపురుపల్లిలో కాలువ పనులను పరిశీలించారు. ఆయనతో పాటు ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు ఉన్నారు.

తహసీల్దార్ల వద్ద ఉన్న అర్జీలపై నివేదిక ఇవ్వండి

● అర్జీదారుల సమస్యలను ఓపిగ్గా వినాలి: కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్ నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ల వద్ద ఉన్న అర్జీలను మండల ప్రత్యేకాధికారులు సమీక్షించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ రామ సుందర్ రెడ్డి ఆదేశించారు. ఉద్యోగులు సచివాలయాల్లో ఉండడంలేదని, ఈ విషయంపై తనిఖీచేయాలని పేర్కొన్నారు. సోమవారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ వినతులపై సమీక్షించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మండల ప్రత్యేకాధికారులు వారానికి నాలుగు సచివాలయాలు సందర్శించాలని సూచించారు. అర్జీదారు సమస్యను పూర్తిగా అర్థం చేసుకోవాలని, వారు చెప్పే విషయాన్ని ఒప్పిగ్గా వినాలని అప్పుడే వారికి సంతృప్తి కలుగుతుందని చెప్పారు. వినతులపై స్వయంగా సంబంధించి అధికారే ఎండార్స్‌మెంట్ చేయాలని, కింది స్థాయి అధికారులకు అప్పగించకూడదని చెప్పారు. ప్రీఆడిట్‌లో ప్రవర్తనాపరమైన లోపాల పద్ధతిని అనుసరించే విధానంపై కలెక్టరేట్ కాల్‌సెంటర్ నుంచి ఆడిట్ టీమ్ అర్జీదారులతో మాట్లాడి ఫోన్ ద్వారా తెలుసుకోనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్ మురళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామసుందర్ రెడ్డి

అన్ని నియోజకవర్గాల్లో పరిశ్రమలు: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న లలితకుమారి

లక్కవరపుకోట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పాలనా వికేంద్రీకరణతోపాటు పెట్టుబడులు వికేంద్రీకరణ జరిగి అన్నినియోజకవర్గాల్లో పరిశ్రమలు వస్తాయని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. విశాఖలో ఈనెల 14 నుంచి జరిగిన సీఐఐసదస్సులో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల వరదను చూసి జగన్‌కి దిమ్మతిరిగి బొమ్మ కనబడిందని పేర్కొన్నారు. సోమవారం లక్కవరపుకోటలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ జగన్‌హయాంలో కనీసం అప్పడాల కంపెనీ కూడా రాష్ట్రానికి లేదని విమర్శించారు. సీఎం చంద్రబాబు ఇమేజ్, మంత్రి లోకేష్ కష్టబడడం వల్ల విశాఖలో జరిగిన పెట్టుబుడల సదస్సులో ప్రపంచ దేశాల నలుమూలల నుంచి వరదలా పెట్టుబడులు వచ్చాయన్నారు.కార్యక్రమంలో టీడీపీరాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, రమణమూర్తి, వెంకటరమణ, రాముడు పాల్గొన్నారు.

సంఘ సభ్యులు ఖర్చులు తగ్గించుకోవాలి

కొత్తవలస, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సంఘాల సభ్యులు ఖర్చులు తగ్గించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలని డీఆర్‌డీఏ అదనపు సంచాలకుడు డి.రత్నకుమార్ కోరారు. సోమవారం కొత్తవలస మండల సమాఖ్య కార్యాలయంలో 45 గ్రామ సంఘాలకు చెందిన మండల సమాఖ్యకార్యవర్గ సమావేశం జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ అప్పు పొందిన ప్రతి సభ్యురాలు జీవనోపాధికార్యక్రమాలకు ఉపయోగించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు చిరంజీవి, జె.లక్ష్మీనాయుడు, ఏజీఎం చిట్టి బాబు, డీపీఎం మూర్తి, వెంకటరమణ పాల్గొన్నారు.

మోనూ ప్రకారం భోజనం అందించాలి



మాట్లాడుతున్న రమణ

మెరకముడిదాం,నవంబరు 17(ఆంధ్రజ్యోతి):మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని చీపురుపల్లి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కేవీ రమణ కోరారు. సోమవారం మెరకముడిదాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల యాక్షన్‌ప్లాన్‌పై సమీక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనపథకం అమలును పరిశీలించారు.కార్యక్రమంలో ఎంఈవో ఎం.చంద్రశేఖర్, హెచ్ఎం ఎస్.తిరుపతిరావు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

నెల్లిమర్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):నెల్లిమర్ల ఎంజేపీఏపీ బీసీ మత్స్యకార బాలుర గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థి వేచలపు జస్వంత్ కర్నూలులో ఈ నెల 21 నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-17 కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.కవిత సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. జస్వంత్‌ను, తర్ఫీదును ఇచ్చిన పీడీ ఎం.రామలక్ష్మిని అభినందించారు.

స్వదేశానికి తీసుకురావాలి

● బంగ్లాదేశ్ బాధిత మత్స్యకార కుటుంబాల వినతి



విశాఖ కలెక్టర్ హరేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకారులు

భోగాపురం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): వేట సాగిస్తూ బంగ్లాదేశ్ జలాల్లోకి వెళ్లి నేవీ అధికారులకు చిక్కి అక్కడ జైలులోఉన్న భోగాపురం, పూసపాటిరేగ మండలాలకు చెందిన మత్స్యకారులను స్వదేశానికి తీసుకురావాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.ఈమేరకు ఆయా కుటుంబాల సభ్యులు, మత్స్యకార నాయకులు సూరాడ చిన్నారావు, వంగా గురుమూర్తి ఆధ్వర్యంలో సోమవారం విశాఖ కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎంఎన్ హరేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. బంగ్లాదేశ్‌లోఉన్న మత్స్యకారులను స్వగృహాలకు తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఇక్కడకు వచ్చే వరకు ఆయా కుటుంబాలను ప్రతినెలా ఆర్థికంగా ఆదుకోవాలని వినతి పత్రం కోరారు. విశాఖ జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మణరావుకు సమస్య పరిష్కరించాలని కలెక్టర్ కోరారు. కాగా మత్స్యకారుల వినతి మేరకు విజయవాడలోని మత్స్యశాఖ కమిషనర్, విజయనగరంజిల్లా కలెక్టర్‌కు సమస్యను నివేదించి సమస్య పరిష్కరిస్తామని లక్ష్మణరావు తెలిపారు.

కుష్టువ్యాధి గుర్తింపునకు సర్వే

మెరకముడిదాం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):గర్భాం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న 27 గ్రామాల్లో సోమవారం నుంచి ఈనెల 30 వరకు కుష్టువ్యాధి గుర్తింపునకు సర్వే నిర్వహించనున్నట్లు వైద్యులు అనీల్‌కుమార్, అజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సర్వేను మొరకముడిదాంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి కుటుంబసభ్యుల చర్మంపైన ఎక్కడ స్పర్శలేని మచ్చలు ఉన్నా తనిఖీ చేస్తామని చెప్పారు. ఒకవేళ స్పర్శలేని మచ్చలు ఉన్నట్లైతే వారిని అనుమానితులుగా గుర్తించి వారిని మెడికల్ ఆఫీసర్ నిర్ధారణచేసి వైద్యం అందించనున్నట్లు చెప్పారు. కార్య క్రమంలో ఎంపీహెచ్ఈవో మురళీకృష్ణ, పీహెచ్ఎన్ వి.రాధాబాయితోపాటు ఎన్ఎంఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పీపీసీ వద్ద సిబ్బంది అప్రమత్తంగా వ్యవహించాలి

నెల్లిమర్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల(పీపీసీ) వద్ద సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని తహసీల్దార్ కె.శ్రీకాంత్ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పని చేసే సిబ్బంది,గ్రామ వ్యవసాయసహాయకులు, వీఆర్వోలకు, పంచాయతీ కార్యదర్శులకు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల సీఈవోలకు శిక్షణనిర్వహించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ శంకరరావు, వెలుగు ఏపీఎం సురేష్ పాల్గొన్నారు.అలాగే సత్తివాడ పీఏసీఎస్ పరిధిలో సత్తివాడ, రామతీర్థంల్లోనూ, కొండవెలగాడ పీఏసీఎస్ పరిధిలో కొండవెలగాడ, కొండగుంపాం గ్రామాల్లో, అలాగే మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో బొప్పడాం, గుషినిల్లో త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి.

తల్లిదండ్రులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

●జిల్లాలోని పలుచోట్ల సీనియర్ సిటిజన్ల చట్టంపై అవగాహన సదస్సులు



శృంగవరపుకోట: మాట్లాడుతున్న న్యాయాధికారి

తల్లిదండ్రులపై నిర్లక్ష్యం వ్యవహరిస్తే వారి పిల్లలపై చర్యలు తప్పవని న్యాయాధికారులు తెలిపారు. సోమవారం జిల్లాలోని పలు చోట్ల తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమచట్టం-2007పై అవగాహన సదస్సులు నిర్వహించారు.

● గజపతినగరం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో తల్లిదండ్రులపై పిల్లలు వివక్షత చూపితే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు న్యాయాధికారి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ హెచ్చరించారు. గజపతినగరం కోర్టు ఆవరణ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ సిటిజన్స్‌కు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ కిరణ్‌కుమార్‌నాయుడు, న్యాయవాదులు శీర వాసుదేవరావు, శేఖర్ పాల్గొన్నారు.

● శృంగవరపుకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణ పిల్లల కర్తవ్యమని ఎస్.కోట జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.కనకలక్ష్మి తెలిపారు. ఎస్.కోట పంచాయతీ కార్యాలయంలో అవగాహన సదస్సులో భాగంగా వయోవృద్ధుల చట్టం- 2007గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు గేదెల ప్రకాశరావు, సత్యాజీ, బి.సత్యనారాయణ, ఎం.అనురాధ, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

● కొత్తవలస, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే మంచి చెడ్డల గురించి తెలుసుకోవాలని కొత్తవలస కోర్టు న్యాయాధికారి డాక్టర్ సముద్రాల విజయచందర్ తెలిపారు. మండలంలోని రామలింగపురం, వియ్యంపేట జడ్పీహైస్కూల్‌లో న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. వియ్యంపేటలో జరిగిన కార్యక్రమంలో బాలలకు సంబంధించి చట్టాలపై వివరించారు. రామలింగపురంలో జరిగిన కార్యక్రమంలో లోక్ అదాలత్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏజీపీ ఎంవీఎస్ గిరిబాబు, న్యాయవాద సంఘం అధ్యక్షురాలు డీవీఎల్ దేవి, న్యాయవాది సీహెచ్ రామచంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలి

● శానిటేషన్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తినాయుడు



రాజాం రూరల్: మాట్లాడుతున్న రామ్మూర్తినాయుడు

రాజాం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనంగా రూ.15 వేలు ఇవ్వాలని, పనిభారాన్ని తగ్గించాలని శానిటేషన్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సోమవారం రాజాంలో శానిటేషన్ సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం కేవలం రూ. ఆరు వేలు మాత్రమే ఇస్తోందని తెలిపారు.

●శృంగవరపుకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట ఎంఈవో కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు, శానిటేషన్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలిపారు. అనంతరం ఎంఈవో నర్సింగరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మద్దిల రమణ, చెలికాని ముత్యాలు, జన్ని సన్యాసమ్మ, గౌరి,ఉమామహేశ్వరీ పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలి

లక్కవరపుకోట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని గ్రీన్ అంబాసిడర్లు నిరసన తెలిపారు. అనంతరం సీఐటీయూ నాయకుడు గాడి అప్పారావు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.

జీవో-23 రద్దు చేయాలి

నెల్లిమర్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పని గంటలను 12 గంటలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో- 23 రద్దుచేయాలని ఐఎఫ్‌టీయు జిల్లా నాయకుడు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలసూర్తి, నెల్లిమర్ల జ్యూట్ మిల్ కార్మిక సంఘం(ఇఫ్టూ) అధ్యక్షుడు నామాల తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి మద్దిల అప్పలనాయుడు వినతిపత్రం అందజేశారు.

కార్మికుల సమ్మె విరమణ

గజపతినగరం,నవంబరు17(ఆంధ్రజ్యోతి): బకాయివేతనాలను చెల్లించాలని మూడు రోజులుగా సమ్మె బాటపట్టిన పంచాయతీ పారిశుధ్య కార్మికులు సోమవారం సమ్మె విరమించి విధులకు హాజరైనట్లు సంఘనాయకులు నాగేశ్వరరావు, బి.కనకరాజులు తెలిపారు.రెండునెలలుగా వేతనాలుఅందడంలేదని సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మెబాట పట్టారు. సోమవారం గజపతినగరం, పురిటిపెంట పంచాయతీ అధికారులు నెల వేతనం చెల్లించడంతో పాటు రెండోనెలకు సంబంధించి గురువారం చెల్లించనున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో జనార్దనరావు తెలిపారు.

చికిత్సపొందుతూ ఇద్దరి మృతి

ఉమ్మడి జిల్లాల్లో వేర్వేరు ప్రమాదాల్లో ఆదివారం గాయపడిన ఇద్దరు వ్యక్తులు సోమవారం చికిత్సపొందుతూ మృతిచెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాధం నెలకొంది.

బైక్ బోల్తా పడి ఒకరు..

రామభద్రపురం, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పూడివారి కల్లాల వద్ద ఆదివారం సాయంత్రం బైక్ బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఏఎస్ఐ అప్పారావు తెలిపారు. పోలీసుల కథనం మేరకు సాలూరులోని పెదహరి జనపేటకు చెందిన బొంగు రవి (58) చీపురుపల్లి నుంచి బైకుపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనం తప్పించే క్రమంలో బైక్ బోల్తా పడింది. దీంతో రవి గాయపడ్డాడు.అతడిని వెంటనే సాలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమచికిత్స అందజేశారు. అక్కడ నుంచి విజయనగరం తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందినట్టు తెలిపారు. మృతుడి భార్య గౌరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు.

చీకట్లో ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో..

బొండపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బొండపల్లిలోని క్రికెట్ మైదానానికి సమీపంలో జాతీయరహదారి-26పై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ యు.మహేష్ కథనం మేరకు.. గజపతినగరం మండలంలోని కాళంరాజుపేట గ్రామానికి చెందిన రెడ్డి పోలినాయుడు (34) ద్విచక్రవాహనంపై ఈనెల 15వ తేదీ రాత్రి గజపతినగరం నుంచి విజయనగరం వెళ్తున్నాడు. అదే సమయంలో కాలినడకన బొండపల్లికి చెందిన కెల్ల ఈశ్వరరావు వెళ్తుండగా చీకటిలో అదుపుతప్పి వాహనం ఢీకొంది. ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడిన పోలినాయుడును ప్రథమ చికిత్స నిమిత్తం విజయనగరంలోని సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి కేజీహెచ్‌కు తరలించడంతో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. కెల్ల ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి ఆరేళ్లు జైలు

విజయనగరం దాసన్నపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో గతఏడాదిలో నమోదైన హత్యాయత్నం కేసులో పూల్‌బాగ్ కాలనీకి చెందిన కోటా అమరనాథ్‌కు ఆరేళ్ల జైలుశిక్ష విధిస్తూ నాలుగో ఏడీజే, ఎస్సీఎస్టీ కోర్టు న్యాయాధికారి బి.అప్పలస్వామి సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు. ఎస్పీకథనం మేరకు.. మండలంలోని గొల్లలపేటకు చెందిన కొయ్య కృష్ణమ్మ విజయనగరంలోని బొగ్గులదిబ్బలో నివాసముంటున్న తన కుమార్తె వద్దకు నడుచుకుంటూ వస్తోంది. అదే సమయంలో కోట అమరనాథ్ పొదల నుంచి అకస్మాత్తుగా వచ్చి ఆమెపై రాయితో దాడి చేసి గాయపరిచి హత్య చేయడానికి ప్రయత్నించి ఆమె వద్ద ఉన్న డబ్బును లాక్కున్నాడు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ హరిబాబు నాయుడు కేసు నమోదుచేశారు. దర్యాప్తు చేపట్టి కోట అమరనాథ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై అభియోగ పత్రాలు దాఖలుచేయగా, నేరారోపణలు రుజువుకావడంతో న్యాయాధికారి అప్పలస్వామి ఆరేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో క్రియాశీలకంగా వ్యవహరించిన సీఐ ఆర్‌వీఆర్‌కే చౌదరి, ఎస్ఐ హరిబాబు నాయుడు, కోర్టు ఏఎస్ఐ శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, పీపీ జి.సత్యాన్ని ఎస్పీ దామోదర్ అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఏడు రోజులు..

జామి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జామి వినాయకుడి ఆలయం వద్ద నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఆటో డ్రైవర్ జామి స్వామినాయుడుకు ఎస్.కోట స్పెషల్ జ్యుడిషియల్ సెంకడ్‌క్లాస్ మెజిస్ట్రేట్ గండి అప్పలనాయుడు ఏడురోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ వైవీ జనార్దన్ తెలిపారు.వేపాడమండలంలోని ముకుందపురానికి చెందిన స్వామినాయుడు ఆటో నడుపుకొని వస్తుండగా డ్రంకెన్‌టెస్ట్ చేశామని చెప్పారు. తనిఖీల్లో ఆటోడ్రైవర్ మద్యం సేవించినట్లు గుర్తించి కేసు నమోదుచేసి న్యాయస్థానంలో హాజరుపరచగా ఏడురోజులు జైలు విధించినట్లు తెలిపారు.

స్టాపర్ల ధ్వంసం చేసిన వ్యక్తికి ఆరు నెలలు..

గంట్యాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):గంట్యాడ పోలీసు స్టేషన్ పరిధిలో రహదారి ప్రమాదాల నియంత్రణకు ఏర్పాటు చేసిన స్టాపర్లను ధ్వంసం చేసిన కేసులో ఓ వ్యక్తికి జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పొన్నారు బుజ్జి ఆరునెలలు జైలు శిక్ష విధించారు.ఎస్పీ దామోదర్ కథ నం మేరకు.. భీమినిపట్నం మండలంలోని గొల్లతాళ్లవలసకు చెందిన కోల వెంకట హేమంతకుమార్ 2022లో గంట్యాడ-బొడ్డవరం రహదారి మధ్య ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన స్టాపర్లను తన వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి ఢీకొట్టి ధ్వంసంచేశారని అప్పటి ఎస్ఐ కేసు నమోదు చేశారు. నిందితుడిపై నేరారోపణ రుజువుకావడంతో ఆరు నెలలపాటు జైలు శిక్ష విధిస్తూ సోమవారం మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.

బొడ్డవర హైవేపై కారు దగ్ధం

ఎస్.కోట రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవర హైవేపై సోమవారం ఉదయం కారు దగ్ధమయ్యింది. స్థానికుల కథనం మేరకు.. హైవేపై ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి కారు పార్కింగ్‌చేసి వెళ్లిపోయాడు. ఇంతలో ఒక్కసారిగా కారు నుంచి మంటలు రావడంతో రాత్రి 12 గంటల తర్వాత అగ్నిమాపక సిబ్బందికి సమాచారం రావడంతో వెళ్లి అదుపులోకి తెచ్చారు. అప్పటికే కారు కాలిబూడిదయ్యింది. కాగా తమకు అగ్నిమాపకశాఖ సమాచారం ఇచ్చిన వెంటనే పరిశీలించామని సీఐ నారాయణమూర్తి తెలిపారు.ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని దీనిపై తాము దర్యాప్తు చేస్తామని చెప్పారు.

ఎంవీజీఆర్‌లో ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ ప్రోగ్రాం

డెంకాడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చింతలవలసలోని ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం సంయుక్తంగా మిశ్రమ పదార్థాల్లో ఇటీవల పురోగతి మోడలింగ్ సమగ్రపరచడం- ప్రయోగాత్మక విధానాలపై ఐదురోజుల ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. మిశ్రమ పదార్థాల్లో తాజా పురోగతులు గురించి అత్యాధునిక జ్ఞానాన్ని అందించడం, మెరుగైన ఇంజనీరింగ్ అప్లికేషన్ల కోసం మోడలింగ్, ప్రయోగాత్మక విధానాలను ఏకీకృతం చేయడం లక్ష్యంగా ఎఫ్‌డీపీ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సోమవారం జరిగిన ఈ ఐదు రోజుల ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ కార్యక్రమంప్రారంభోత్సవానికి ఎన్ఐటీ రూర్కెలాలోని మెటలర్జికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రాజేష్‌కుమార్ ప్రస్టీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నిర్మాణం,తయారీ ప్రక్రియలను మెరుగుపరచడంలో మిశ్రమ పదార్థాల ప్రాధాన్యతను ఎంవీజీఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎంసీ శేఖర్ వివరించారు. మిశ్రమ పదార్థాల రంగంలో వినూత్న పరిణామాలను స్వీకరించి పనిచేసే ఆలోచన దృక్పథం ఉండాలని ఎఫ్‌డీపీవో పాల్గొన్న వారికి సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తోపాటు మెకానికల్, సివిల్, ఇంజనీరింగ్ హెచ్‌వోడీ డాక్టర్ ప్రవీణ్‌కల్లా, సివిల్ ఇంజనీరింగ్ హెచ్‌వోడీ డాక్టర్ మురళీసాగర్‌వర్మ సాగి, మెకానికల్, సివిల్ ఫ్యాకల్టీ ఎఫ్‌డీపీ కోఆర్డినేటర్లు డి.సంతోష్‌కుమార్, డాక్టర్ జి.ప్రమోద్‌కుమార్, బీవీ జోగారావు తదితరులు పాల్గొన్నారు.

భూములు సంబంధంలేని వారికి పరిహారం

ఎస్.కోట రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరుతో యువతను మోసంచేయడంతోపాటు ఈప్రాంతం భూములతో సంబంధం లేనివారికి రెవెన్యూ యంత్రాంగం పేర్లు నమోదుచేయించి లక్షల రూపాయలు అక్రమంగా పరిహారం ఇప్పించారని జిందాల్ నిర్వాసితులు ఆరోపించారు.జిందాల్ యాజమాన్యం, రెవెన్యూ యంత్రాంగం గతంలో ఉద్యోగాల పేరుతో భారీ మోసం చేశాయని విమర్శించారు. దీనికి సంబంధించిన అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, విచారణకు జిల్లా యంత్రాంగం సిద్ధమా అని పేర్కొన్నారు.ఈ మేరకు సోమవారం మండలంలోని బొడ్డవర వద్ద 158 రోజు రిలేదీక్షను జిందాల్ నిర్వాసితులు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బినామీ చెల్లింపులు వివరాలు తమ వద్ద ఉన్నాయని చెప్పారు.



నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

కట్టడి చేస్తారా?

(ఐదో పేజీ తరువాయి)

మృతిచెందారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 8 వేల మంది కుక్కకాటు బారిన పడ్డారు. ఆరుగురు మృతిచెందారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 13 వేల కుక్కలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. గత ఏడాది కాలంలో 6,500 కుక్కలకు యాంటీ రేబిస్ ఇంజక్షన్లు, ఆపరేషన్లు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం అటువంటి పరిస్థితి కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. అప్పట్లో రోజుకు 25 కుక్కలకు సంతానోత్పత్తి నియంత్రణ చికిత్సలు చేయాలని నిర్ణయించారు. ఇందుకుగాను ఓ సంస్థకు బాధ్యతలు అప్పగించారు. ఒక్కో కుక్కకు రూ.1500 చెల్లించేందుకు నిర్ణయించారు కానీ అనుకున్న స్థాయిలో ఇది ముందుకు సాగలేదు.

రాజాం మునిసిపాల్టీలో..

రాజాం మునిసిపాల్టీలో కుక్కల తాకిడి అధికం. సమీప గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కుక్కలు వచ్చి చేరుతున్నాయి. మునిసిపాల్టీ పరిధిలో 5 వేల కుక్కలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. కానీ ఎటువంటి నియంత్రణ చర్యలు చేపట్టడంలేదు. ప్రస్తుతం మునిసిపాల్టీకి పాలక వర్గం లేదు. ఆపై యంత్రాంగం సైతం సరిగ్గా స్పందించడం లేదు. పట్టణంలోని శివారు ప్రాంతాల్లో వాటి విహారం నానాటికీ అధికమవుతోంది.

ఆ రెండుచోట్ల సైతం..

బొబ్బిలి మునిసిపాల్టీలో సైతం కుక్కల నియంత్రణ చర్యలు కానరావడం లేదు. పట్టణంలో 3 వేల వరకూ కుక్కలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. గతంలో కుక్కల నియంత్రణకుగాను చర్యలు ఉండేవి. విజయనగరంతో పాటు బొబ్బిలిలో కుక్కల సంతానోత్పత్తి నియంత్రణకుగాను ఆపరేషన్లు నిర్వహించేందుకు ప్రత్యేక భవనాలు నిర్మించారు. ప్రత్యేక గదులను ఏర్పాటుచేశారు. ఆపరేషన్లు చేసేందుకుగాను పరికరాలు, యంత్రాలను సైతం అందుబాటులోకి తెచ్చారు. పశుసంవర్థక వైద్యులతో పాటు సిబ్బందిని నియమించారు. ఎందుకో ఆ తరువాత వీటి గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో ఈ భవనాలు వృథాగా ఉన్నాయి. నెల్లిమర్ల నగర పంచాయతీలో సైతం ఇదే పరిస్థితి ఉంది. తాజాగా మునిసిపల్ శాఖ సీరియస్‌గా దృష్టిపెట్టడంతో ఇకనైనా కుక్కలకు అడ్డుకట్ట పడుతుందా? లేదా? అన్నది చూడాలి.

తిరిగి ఇచ్చేయాలి

(ఐదో పేజీ తరువాయి)

చినఖండేపల్లి, మూలబొడ్డవర గ్రామాల పరిధిలోని 1166 ఎకరాలను జిందాల్ సౌత్ వెస్ట్ అల్యూమినియం లిమిటెడ్‌కు 17 ఏళ్ల కిందట కేటాయించారు. అప్పట్లో భూములను కోల్పోనప్పటికీ 12మంది రైతులు జిందాల్‌కు కేటాయించిన భూముల్లో తమ భూములు కూడా ఉన్నాయని తప్పుడు పత్రాలతో రూ.36.10లక్షలు పొందారు. దీంతో నిజమైన రైతులకు అన్యాయం జరిగింది. ఈ విషయం బయటకు పొక్కడంతో లోక్‌సత్తాపార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ రిటైర్డ్ రెవెన్యూ అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీ పూర్తిస్థాయిలో విచారించిన తరువాత బినామీల పేరుతో వీరంతా సొమ్మును అక్రమంగా తీసుకున్నారని నిర్ధారించింది. దీంతో ఈ అంశాన్ని అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న జయప్రకాష్ నారాయణ శాసనసభలో ప్రస్తావించారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో రెవెన్యూ శాఖామంత్రిగా ఉన్న ధర్మాన ప్రసాదరావు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)అధికారులకు విచారణ బాధ్యత అప్పగించారు. ఈశాఖ అధికారులు తప్పు జరిగినట్లు గుర్తించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆ ప్రభుత్వానికి నివేదించారు. ఆర్ఆర్ (రెవెన్యూ రికవరీ) చట్టం ప్రయోగించాలని సూచించారు. ఇంత జరిగినా చర్యలు లేవు. ఆ తర్వాత కూడా పట్టించుకోకపోవడంతో ఈ విషయం మరుగున పడిపోయింది. మళ్లీ ఇన్నాళ్లకు కీలక అడుగు పడింది. వారి నుంచి సొమ్మును తిరిగి రాబట్టేందుకు రెవెన్యూ అధికారులు అడుగు వేసారు. భూములను తీసుకున్న జిందాల్ యాజమాన్యం ఇంతవరకు ఇక్కడ ఎటువంటి పరిశ్రమ నిర్మించలేదు. భూములన్నింటినీ ఖాళీగా ఉంచేసింది.

నోటీసులు జారీ చేశాం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బినామీలకు నోటీస్‌లు జారీ చేశాం. నోటీస్ అందుకున్న ఏడు రోజుల్లో వారు జిందాల్ నుంచి అక్రమంగా పొందిన సొమ్మును ప్రభుత్వానికి చెల్లించాలి. ఆర్ఆర్ (రెవెన్యూ రికవరీ) చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటున్నాం.

- డి.శ్రీనివాసరావు, తహసీల్దార్, శృంగవరపుకోట

ఈ మార్పు.. ఎటువైపో!

(ఐదో పేజీ తరువాయి)

ఇండస్ట్రియల్ కామర్స్ డిపార్ట్‌మెంటు వారు ఇక్కడ ఎంఎస్ఎంఈ పార్కు, ఇతర పరిశ్రమల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలోనే ఈ తంతు జరిగినప్పటికీ ఈ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కులు, ఇతర పరిశ్రమల నిర్మాణం చేపట్టలేకపోయింది. పారిశ్రామికీకరణకు కట్టుబడిని కూటమి ప్రభుత్వం జిందాల్ భూముల్లో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు సుముఖంగా ఉంది. ఇందుకు అనుగుణంగా గత నెలలో మంత్రిమండలి తీర్మానం చేసింది.

ఆరు నెలలుగా ఉద్యమ బాట

అప్పట్లో జిందాల్‌కు భూములు ఇచ్చిన రైతులు తిరిగి తమ భూములను ఇచ్చేయాలన్న డిమాండ్‌తో ఆరు నెలలుగా ఉద్యమిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్‌లకు ఫిర్యాదు చేశారు. హైకోర్టులోనూ కేసులు వేశారు. భూములను తీసుకున్న యాజమాన్యం ఇంతవరకు పరిశ్రమను నిర్మించకుండా అన్యాయం చేయడంతో పాటు ప్రతిపాదిత పరిశ్రమ కాకుండ ఎంఎస్ఎంఈ పార్కు, ఇతర పరిశ్రమల నిర్మాణానికి భూములను అమ్మకం పెట్టిందని ఆరోపిస్తున్నారు. దీన్ని జిందాల్ యాజమాన్యం పట్టించుకోవడం లేదు. నిర్వాసితుల్లో అసహనం పెరుగుతుండడంతో ఆందోళనలను విరమించడం లేదు. ఈ నేపథ్యంలోనే ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణాల భూమి పూజకు జాప్యం జరుగుతోంది. భూనిర్వాసితుల సమస్యకు పరిష్కారం చూపడంతో పాటు త్వరితగతిన ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

వేటకు వెళ్లి..

(ఐదో పేజీ తరువాయి)

వేరొక చోటుకు వెళ్లగా లక్ష్మణరావు కొన్ని చేపలు పట్టి ఒడ్డున పెట్టాక మళ్లీ నదీలోకి దిగాడు. ఇంకాస్త లోపలకు వెళ్లాడు. లోతు ఎక్కువగా ఉండడం.. ఈత రాకపోవడంతో గల్లంతయ్యాడు. గ్రామస్థులు ఆచూకీ కోసం రెండురోజుల పాటు గాలించారు. రెవెన్యూ, పోలీస్‌లకు సోమవారం సమాచారం ఇవ్వగా పాలకొండ అగ్నిమాపక సిబ్బంది సహకారంతో రేగిడి ఎస్ఐ బాలకృష్ణ, సిబ్బంది సాయంత్రం వరకు గాలించారు. అంతలో ఖండ్యాం సమీపంలో లక్ష్మణరావు మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో లక్ష్మణరావు బంధువులు వెళ్లి నిర్ధారించారు. రేగిడి పోలీసులు ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజాం ఆస్పత్రికి తరలించారు. లక్ష్మణరావుకు భార్య గౌరి, వివాహితులైన ఇద్దరు కుమార్తెలు చంద్రకళ, మౌనిక ఉన్నారు. రేగిడి పోలీస్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.436కే లక్షల బీమా

(ఐదో పేజీ తరువాయి)

సంవత్సరాల వయసు కలిగిన బ్యాంకు ఖాతాదారులకు ప్రమాదం ఎదురైతే దుర్ఘటన స్థాయి, వైకల్యానికి బీమా వర్తిస్తుంది. అలాగే ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన పథకంలో రూ.436 వార్షిక ప్రీమియంపై రూ.2 లక్షల జీవిత బీమా వర్తిస్తుంది. 18 నుంచి 50 సంవత్సరాల వయసు కలిగిన బ్యాంకు ఖాతాదారులకు ఇది వర్తిస్తుంది. వారి కుటుంబ సభ్యులకు కూడా బీమా వర్తిస్తుంది. వీటిపై అవగాహనకు సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థకు చెందిన కౌన్సిలర్లు చంటి, లక్ష్మణ్‌లు బొబ్బిలి పరిసర ప్రాంతాలకు వెళ్లి పథకాలపై ప్రచారం చేస్తున్నారు. ఆర్థిక అక్షరాస్యతకు సంబంధించి కూడా అవగాహన కల్పిస్తున్నారు. సైబర్, ఆర్థిక మోసాలపై సైబర్‌క్రైమ్ నెంబరు 1930కు కాల్ చేయాలని, ఆర్‌బీఐఓఎస్ టోల్ ఫ్రీ నెంబరు 14448కు ఫిర్యాదు చేయవచ్చని అవగాహన కల్పిస్తున్నారు. అధిక డబ్బుకు ఆశపడి గుర్తింపు లేని ఆర్థిక సంస్థలలో పొదుపు, మదుపు, రుణాలు తీసుకోవడం చేయవద్దని కోరుతున్నారు.

కొత్త వాహనాలు వదిలేశారు

- షెడ్లు నిర్మించినా.. ఆరుబయటే వాహనాలు
- ఇదీ బొబ్బిలి మున్సిపాలిటీలో దుస్థితి

బొబ్బిలి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర సాధనలో భాగంగా స్థానిక మున్సిపాలిటీకి కేటాయించిన చెత్త సేకరణ వాహనాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఆరుబయటే వాటిని వదిలేశారు. అవి వినియోగంలోకి రాకుండానే తుప్పు పట్టి పాడవుతున్నాయి. పట్టణ పరిధిలోని 31 వార్డుల్లో చెత్త సేకరణ కోసం స్థానిక మున్సిపాలిటీకి గత ప్రభుత్వం 10 విద్యుత్ వాహనాలను సమకూర్చింది. వాటి కోసం ప్రత్యేకంగా షెడ్లు కూడా నిర్మించారు. అయితే వాటిని వినియోగంలోకి తీసుకురాలేదు. వాహనాలకు విద్యుత్ చార్జింగ్ కోసం ఏర్పాటు చేసిన షెడ్ మాత్రం కనిపిస్తోంది. వాహనాలన్నింటినీ ఒకేసారి నడిపేందుకు డ్రైవర్ల కొరత కూడా ఉంది. ఎటువంటి ముందు చూపు లేకుండా ప్రభుత్వం ఉన్నత స్థాయిలో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు వాహనాలను ఇచ్చేసి చేతులు దులుపుకుంది. వాటి నిర్వహణ, మరమ్మతు విషయాన్ని గాలికి వదిలేసింది.

కాంపాక్టు బిన్లు అన్ని వార్డులకు సరిపడినన్ని లేవు. ప్రస్తుతం 30 మాత్రమే ఉన్నాయి. అవి సైతం పాడయ్యాయి. మినీ బిన్లు అవసరమైన సంఖ్యలో లేవు. 65 బిన్లతో చాలా పాడైపోయాయి. ఇదిలా ఉండగా 60 పుష్ కార్ట్స్ ట్రాక్టర్లు, కాంపాక్టర్, టిప్పరు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. చెత్తసేకరణ వాహనాలు సైతం మూలకు చేరడంతో పట్టణంలోని పలు కూడళ్లలో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. స్వచ్ఛాంధ్రకు సంబంధించి ఇటీవల రాష్ట్రస్థాయి అవార్డు దక్కించుకున్న బొబ్బిలి మున్సిపాలిటీలో పలుచోట్ల చెత్తకుప్పలు దర్శనమిస్తుండడంతో ప్రజల నుంచి పెదవివిరుపులు కనిపిస్తున్నాయి.

చెత్తసేకరణ ఆటోల మరమ్మతు కోసం రూ.5 లక్షలతో ప్రతిపాదనలు చేశారు. పారిశుధ్య నిర్వహణ కోసం కొనుగోలు చేసిన వాహనాల నిర్వహణ భారంతో మున్సిపాలిటీలు ఇబ్బందులు పడుతున్నాయి. తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో ఇందుకోసం ప్రత్యేకమైన బడ్జెట్‌ను కేటాయించాల్సిన అవసరం ఉంది.





వాహనాల కోసం నిర్మించిన షెడ్లు, ఆరుబయటే నిలిపిన కొత్త వాహనాలు

వాహనాల మరమ్మతులకు చర్యలు తీసుకున్నాం..

పట్టణంలో చెత్తను సేకరించే వాహనాల మరమ్మతు కోసం చర్యలు తీసుకున్నాం. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో రూ.5 లక్షల వ్యయానికి కౌన్సిల్ ఆమోదం తీసుకున్నాం. వీలైనన్ని ఎక్కువ వాహనాలను వినియోగంలోనికి తీసుకువస్తాం.

-లాలం రామలక్ష్మి, మున్సిపల్ కమిషనర్, బొబ్బిలి

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

రామభద్రపురం, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ అజు రఫీజాన్ తెలిపారు. సోమవారం ఆయన మండల రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యుటేషన్, ఇతర రెవెన్యూ సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే గ్రామాల్లో ఎటువంటి సమస్యలు లేకుండా రైతులకు మంచి సేవలు అందించాలన్నారు. సమావేశంలో హెచ్‌డీటీ గిరిధర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు ఆదరణ అభినందనీయం

విజయనగరం క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్లపై మానసిక రుగ్మతలతో బాధపడుతూ, ఆదరించే వారు లేకుండా నిరాశ్రయులైన మతిస్థిమితం లేని వ్యక్తులకు మనోబంధు ఫౌండేషన్ అందజేస్తున్న సేవలు అభినందనీయమని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. సోమవారం విజయనగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఫౌండేషన్ సభ్యులు రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఎస్పీ ఆవిష్కరించారు.కార్యక్రమంలో సంస్థ ప్రతి నిధులు సత్యం, మెడికల్ అధికారి డా.వేణుగోపాలరెడ్డి, గోవిందరాజులు, మన్మథరావు, సురేష్, రామకృష్ణ, నారాయణరావు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించండి

గుర్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులు కాపాడి వారికి నాణ్యమైన విద్య అందించాలని గరివిడి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆరుద్ర కోరారు. సోమవారం గుర్ల కస్తూరిబా పాఠశాలలో ఎస్‌వో జానకి ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో ఎన్.ఆరుద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారాలను నిలిపివేయండి

రాజాం, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): రైతుబజారు బయట కూరగాయల వ్యాపారాలు నిలిపివేయాలని వ్యాపారులు కోరారు. రైతుబజర్‌కు ఆనుకుని వ్యాపారాలు చేయడం వల్ల లోపలి రైతు బజార్‌కు కూరగాయలు కొనుగోలు చేయడానికి ఎవరు రావడం లేదన్నారు. తమకు నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు వ్యాపారులు మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ కె.శ్రీనివాసరావు, పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారి గుప్తా తదితరులు పాల్గొన్నారు,

పాల ధర పెంపునకు అంగీకారం



కలెక్టర్‌ను సత్కరిస్తున్న సహకార సంఘ మహిళలు

పార్వతీపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ యాజమాన్యం తగ్గించిన పాల ధరను పునరుద్ధరించడంతో పాటు లీటరుకు మరో 0.60 పైసలు పెంచి కొనుగోలుకు అంగీకరించింది. ఇందుకు సంబంధించిన వివరాల్లో వెళితే. పార్వతీపురం, పాలకొండ, భామిని, బలిజిపేట, సీతానగరం మండలాల్లో మొత్తం 14 డెయిరీ సహకార సంఘాలు ఉన్నాయి. ఆ సంఘాల్లో బలిజిపేట మండలానికి చెందిన వంజరంపేట మహిళా సహకార సంఘం, చిన్నవంతరం మహిళా సహకార సంఘాల పరిధిలో 34 మంది మహిళా రైతులు రోజూ సుమారు 160 లీటర్ల పాలను విశాఖ డెయిరీకి అందజేస్తుంటారు. అయితే మహిళా సహకార సంఘాలకు చెందిన రైతులకు సంబంధించిన పాలకు లీటరుకు రూ.2 చొప్పున ఇటీవల విశాఖ డెయిరీ యాజమాన్యం తగ్గించేసింది. దాంతో మహిళా సహకార సంఘాల ప్రతినిధులు కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డిని కలిశారు. తమ సమస్యను వివరించారు. అందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్.. డెయిరీ యాజమాన్యంతో చర్చించారు. దాంతో రైతులకు తగ్గించిన రూ.2తో పాటు అదనంగా లీటరుకు 0.60 పైసలు పెంచి పాలను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సోమవారం మహిళా సహకార సంఘాల ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో కె.హేమలత ఉన్నారు.

రైతులకు కూటమి అండ

భామిని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే నిమ్మల జయకృష్ణ అన్నారు. స్థానిక ఎఫ్‌సీఐ గోదాంలో పాలకొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ, సీసీఐ ఆధ్వర్యంలో సోమవారం పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అన్నిరకాలుగా సహాయ సహకారాలు అందజేస్తున్నాయన్నారు. పలువురు రైతులు పత్తి ప్రభుత్వం కొనుగోలు నాణ్యత పరీక్షలు ఉంటాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రెండు తుపాన్లలో పత్తి నాశనం అయిపోయిందని గణనీయంగా దిగుబడి తగ్గిందని వాపోయారు. వ్యవసాయాధికారులు పత్తి, మొక్కజొన్న, వరి పంట నష్టాలను నమోదు చేయలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆగ్రహించిన ఎమ్మెల్యే.. ఏవో తిలక్‌ను ప్రశ్నించారు. ఎన్ని ఎకరాలు పంట నష్టం నమోదు చేశారన్నారు. దీనిపై రైతులతో కలిసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బిడ్డిక సంధ్యారాణి మాట్లాడుతూ రైతులకు అన్ని సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ముందుగా పాలవలస, మనుమకొండ గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి గ్రామాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్య క్రమంలో ప్రజా ప్రతినిధులు, ఏఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమం బాధ్యత వారిపిల్లలదే..



మాట్లాడుతున్న న్యాయాధికారి రోహిణీరావు

బొబ్బిలి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల శ్రేయస్సు, రక్షణ, ఆహారం, దుస్తులు, నివాసం, వైద్య సహాయం అందించే బాధ్యత వారి పిల్లలు లేదా బంధువులదేనని బొబ్బిలి అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.రోహిణీరావు అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో సోమవారం మండల న్యాయసేవా కమిటీ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, వృద్ధుల నిర్వహణ, సంక్షేమ చట్టం-2007పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రోహిణీరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు లేదా వృద్ధులు తమ పిల్లల నుంచి లేదా బంధువుల నుంచి జీవనోపాధి పొందడం తప్పనిసరి అన్నారు. ఈ చట్టం ప్రకారం వారు సొంత ఆదాయంతో లేదా ఆస్తితో తమను తాము పోషించుకోలేని పరిస్థితుల్లో వారి పిల్లలు, బంధువులు ఆర్థిక సహాయం అందించాలన్నారు. చట్టం కింద నిర్వహణ, సంక్షేమ కేసులను విచారించడానికి ప్రతీ జిల్లాలో ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేసిందన్నారు. బాధితులెవరైనా ఆ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవచ్చన్నారు. తల్లిదండ్రులు తమ ఆస్తిని పిల్లలకు బదిలీ చేసిన తర్వాత వారు సక్రమంగా సాకకపోతే ఆ గిఫ్ట్ డీడ్‌ను రద్దుచేయమని సీనియర్ సిటిజన్లు కోరుకునేందుకు సంపూర్ణ హక్కు ఉంటుందన్నారు. సదస్సులో బొబ్బిలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మత్స ఆనందకుమార్, కార్యదర్శి ఆర్‌వీఎస్ఎస్ ప్రసాద్, సీనియర్ న్యాయవాదులు పీఎం మోహన్‌కుమార్, ఎ.రామకృష్ణ, బి.దాసు ఇతర న్యాయవాదులు, కక్షిదారులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను పరిష్కరించండి

బొబ్బిలి రూరల్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులను తక్షణమే అధికారుల పరిష్కరించాలని తహసీల్దార్ ఎం.శ్రీను అధికారులను ఆదేశించారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన వినతులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు అందజేసిన అర్జీలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్జీదారులకు నిర్ణీత సమయంలో న్యాయం చేయాలన్నారు. పరిష్కరించడానికి వీలుకాని పక్షంలో అందుకుగల కారణాలను అర్జీదారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌డిటి సుబ్బారావు, సీఎస్‌డీటీ సాయికృష్ణ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

బొబ్బిలి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో సోమవారం లైబ్రేరియన్ స్వర్ణకుమారి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు ఎం.పార్వతి, ఎంఎన్‌వీ లలిత పాల్గొని కవిత్వంపై అవగాహన కల్పించారు. రచనా వ్యాసంగంపై విద్యార్థులు ఆసక్తిని, మెలకువలను పెంచుకోవాలన్నారు. ఎంతటివారైనా నిత్యవిద్యార్థిగా శ్రమిస్తే సంపూర్ణ విజ్ఞానవంతులుగా సమాజంలో రాణిస్తారన్నారు. సమాజాన్ని జాగృతం చేసే శక్తి కవిత్వానికి ఉందన్నారు. స్వాతంత్రోద్యమ కాలంలో గ్రంథాయాల్లో అందుబాటులో ఉండే పలు రచనలే ఉద్యమకారులకు ఉత్తేజాన్ని రేకెత్తించిన విషయాన్ని అందరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ఇంగ్లీషుపై పట్టు సాధించాలి

రామభద్రపురం, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): స్పోకెన్ ఇంగ్లీషుపై విద్యార్థులు పట్టు సాధించాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వంగపండు గోపాలనాయుడు సూచించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగిలిన భాషలతో పాటు ఇంగ్లీషుపై కూడా మంచి ప్రతిభ చూపాలని కోరారు. అలాగే గ్రంథాలయాలను విద్యార్థులు వినియోగించుకొని విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.దాలినాయుడు, సీహెచ్. చలపతినాయుడు, బి.ప్రమీలకుమారి, ఒకేషన్ ఉపాధ్యాయని త్రివేణి, లైబ్రేరియన్ బి.సత్యవాణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొబ్బిలి రూరల్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి డివిజన్ పరిధిలో 32 కేవీ ఎస్ఎస్ పేట సబ్ డివిజన్ నుంచి వచ్చే 11 కేవీ చిత్రకోట బొడ్డవలస ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు బొబ్బిలి ఈఈ రఘు ఓ ప్రకటనలో తెలిపారు. చిత్రకోట బొడ్డవలస, వెలగవలస, వెంకటరాయుడుపేట, నారసింహునిపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం కలగనుందని తెలిపారు.

బొబ్బిలి క్రీడాకారులకు పతకాలు



క్రీడాకారులతో ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని బరంపూర్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వర్సిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించిన ఓపెన్ నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో బొబ్బిలికి చెందిన క్రీడాకారులు పలు పతకాలను కైవసం చేసుకున్నారు. తైక్వాండో కోచ్ ఎం.సుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో పాల్గొన్న క్రీడాకారులు 10 బంగారు, 10 కాంస్య, 5 వెండి పతకాలను సాధించారు. జాతీయ స్థాయిలో మొత్తం 900 మంది క్రీడాకారులు పాల్గొనగా, బొబ్బిలికి చెందిన క్రీడాకారులు ఫైటింగ్ అండ్ స్పీడ్ కిక్కింగ్ విభాగాలలో ఈ పతకాలను సాధించినట్టు సుధాకర్ యాదవ్ వివరించారు. విజేతలందరినీ స్థానిక కోటలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబీనాయన అభినందించారు. మున్ముందు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇంకా రాణించి మరిన్ని పతకాలతో బొబ్బిలికి పేరు తీసుకురావాలని క్రీడాకారులను కోరారు.

ఇంటి కోసం తగాదా: అన్నదమ్ముల ఘర్షణ

- తమ్ముడికి గాయాలు

బాడంగి, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఇంటి తగాదాలో తమ్ముడిపై అన్న దాడి చేసిన ఘటన పెదపల్లిలో చోటు చేసుకుందని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు పెదపల్లి గ్రామానికి చెందిన కోటపర్తి కృష్ణ, అతని తమ్ముడు కోటపర్తి గురుమూర్తికి మధ్య ఆదివారం రాత్రి ఉమ్మడి ఆస్తి ఇంటి విషయమై తగాదా జరిగింది. ఈ ఘర్షణలో కోటపర్తి కృష్ణ తన తమ్ముడు కోటపర్తి గురుమూర్తిపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. ఈ ఘర్షణలో గాయపడిన తమ్ముడు కోటపర్తి గురుమూర్తి విజయనగరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. గురుమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోటపర్తి కృష్ణపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. గురుమూర్తికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారని ఎస్ఐ తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



పెంట గ్రామంలో కల్లంలో నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలు

బొబ్బిలి రూరల్ , నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. అధికార యంత్రాంగం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోకపోవడం దారుణమని పలువురు రైతులు అంటున్నారు. త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతుల పంటకు మద్దతు ధర అందే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 10 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయవలసి ఉన్నా ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. రంగరాయపురం, పెంట, కారాడల్లో రైతులు వరి పంటను కోతలు కోసి పొలాల్లో వేస్తున్నారు. కొందరు నూర్పించి బస్తాలలో ఆయా కల్లాల్లో నిల్వ ఉంచారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

బొబ్బిలి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంట్యాకుల వీధికి చెందిన కిడ్నీ వ్యాధి బాధితుడికి కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు అండగా నిలిచారు. వారానికి మూడుసార్లు పార్వతీపురం ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న షాజహాన్‌కు వైద్యఖర్చులు, కుటుంబపోషణ భారంగా పరిణమించాయి. దాంతో హుదా ముస్లిం వెల్ఫేర్ సంస్థ ప్రతినిధుల అభ్యర్థన మేరకు జేసీ రాజు స్పందించి బాధిత కుటుంబానికి సోమవారం రూ. 10 వేలు ఆర్థిక సాయం చేశారు. అలాగే హుదా సంస్థ ప్రతినిధులు రఫీ, జాఫర్ షాజహాన్‌కు రూ. 5 వేలు సాయం చేశారు. కార్యక్రమంలో కారుణ్య సంస్థ ప్రతినిధులు నాగూరు రమేష్, చిన్నారావు, శర్మ, రామకృష్ణ, షేక్ మీరా, షేక్ సాఫీ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందజేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బొబ్బిలి రూరల్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని రామందొరవలస సమీపంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను తక్షణమే లబ్ధిదారులకు అందజేయాలని సోమవారం సీపీఐ నాయకులు తహసీల్దార్ ఎం.శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న మాట్లాడుతూ గతంలో టీ టీడీపీ టిడ్కో ఇళ్ల కోసం పేద, మధ్యతరగతి వారి నుంచి రూ.25 వేలు డిపాజిట్‌గా కట్టించుకుందన్నారు. దాదాపు 80 శాతం పనులు పూర్తయిన ఇళ్లను వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. కొత్తగా జగనన్న కాలనీలు మంజూరు చేసిందన్నారు. అప్పట్లో కట్టిన డిపాజిట్ డబ్బును వెనక్కి ఇవ్వలేదన్నారు. అటు ఇళ్లు, ఇటు డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో పేద, మధ్య తరగతి వారు లబోదిబోమనన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో డిపాజిట్‌దారులతో పాటు మండల కార్యదర్శి తాడంగి ఎండుదొర, నాయకులు ఆర్.నాగమ్మ, పాలక పద్మ పాల్గొన్నారు.